



అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 199 శుక్రవారం 31 అక్టోబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

## కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్ రెడ్డి

**రైతులకు వేదన మిగిల్చిన తుఫాన్**

**అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి**

**నష్టాలను అంచనా వేసి వివరాలను తెలియచేయాలి**

**విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలి**

**వివరాలు ఎప్పటికప్పుడు మంత్రులకు చేరవేయాలి**

**నేడు వరంగల్, హుస్నాబాద్‌లలో పర్యటన**



హైదరాబాద్,**అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):** ఇది వరి కోతల కాలం..కానీ అనుకోని ఉపద్రవం రైతులకు ఆవేదన మిగులుస్తోందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అధికారుల అందరి సెలవులు రద్దు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని కలెక్టర్లకు ఆదేశించారు. ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. మొంథా తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో కురిసిన వర్షాలు, జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్లు సీఎంకు వివరించారు. దెబ్బతిన్న పంటలు, రహదారులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పొందే వరదసాయం అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు. మిగతా 2లో.



## రికార్డ్ చేజింగ్ తో

# వరల్డ్ కప్ ఫైనల్లోకి

**మహిళల ప్రపంచకప్ సెమీస్‌లో ఆస్ట్రేలియాపై భారత్ ఘన విజయం**

**చరిత్రలోనే అత్యధిక స్కోరు ఛేదించి ఫైనల్‌కు చేరిన టీమిండియా**

**అజేయ సెంచరీతో జట్టును గెలిపించిన జెమీమా రోడ్రిగ్స్**

**మూడోసారి ప్రపంచకప్ ఫైనల్లో అడుగుపెట్టిన భారత మహిళల జట్టు**

న్యూఢిల్లీ, **అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):** మహిళల వన్డే ప్రపంచకప్ చరిత్రలో టీమిండియా అద్భుతం సృష్టించింది. అసాధ్యమనుకున్న లక్ష్యాన్ని సుసాధ్యం చేస్తూ, డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను చిత్తు చేసి ఫైనల్లోకి అడుగుపెట్టింది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియం వేదికగా గురువారం జరిగిన సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై 5 వికెట్ల తేడాతో భారత్ చారిత్రక విజయం సాధించింది. మిగతా 2లో.

# నేడు తెలంగాణ కేబినెట్ విస్తరణ

**అజారుద్దీన్ కోసం ప్రత్యేకం**

**రాజ్‌భవన్ దర్బార్ హాలులో ఏర్పాట్లు**




హైదరాబాద్రై,**అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం మధ్యాహ్నం 12:15 గంటలకు కొత్త మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో కేబినెట్ మంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ ఒక్కరే ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ప్రమాణస్వీకారోత్సవం జరిగే రాజ్‌భవన్ దర్బార్ హాల్‌ను ప్రోటోకాల్ అధికారులు పరిశీలించారు. మంత్రి ప్రమాణ స్వీకారానికి సీటింగ్ తదితర ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. మిగతా 2లో.

# మున్నేరు వాగు ఉధృతి

## ఖమ్మం-బొమ్మకల్ రహదారిపై భారీగా వరద

ఖమ్మం,**అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):** మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు ఖమ్మంలోని 'మున్నేరు' వారు మరోమారు ఉధృతంగా సాగుతోంది. అంతకంతకూ నీటిమట్టం పెరగడంతో మరోమారు భయాందోళనలు మొదలయ్యాయి. వాగు పరివాహకంలోని కాలనీలను వరద చుట్టుముట్టింది. మోతీనగర్, బొక్కలగడ్డ కాలనీల్లోకి వరద చేరింది. మోతీనగర్‌లోని 35, బొక్కలగడ్డలో 57 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. మున్నేరుకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం నీటిమట్టం 24.7 అడుగులకు చేరింది. ఎగువన భారీ వర్షాలతో వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వరద నీరు ఖమ్మం-బోనకల్ ప్రధాన రహదారిపై చేరింది మిగతా 2లో.



# దెబ్బతిన్న పంటలు

## పత్తికి భారీ విపత్తు

**కన్నీరు పెట్టుకుంటున్న రైతులు**

**కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లోంచి కొట్టుకుపోయిన ధాన్యం**

**మంత్రులు, అధికారులు, నాయకుల భరోసా**



హైదరాబాద్,**అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):** ఎక్కడెక్కడ ఎన్నెన్ని అప్పులు చేసిందో.. ఎంత పెట్టుబడి పెట్టిందో పాపం.. ఆ మహిళా రైతు ఆరుగాలం పడిన కష్టమంతా వరదపాలైంది. కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యమంతా వర్షపు నీటి వరదలో కొట్టుకుపోయి డ్రైనేజీ పాలైంది. దిక్కుతోచని స్థితిలో తానే ఆ మోరీలోకి దిగి బిగ్గరగా రోదిస్తూ నీళ్లలో ముంచి గంపలతో ధాన్యాన్ని పైకెత్తి పోసింది! అర క్వింటానా.. క్వింటానా? కొట్టుకుపోయింది దాదాపు 150 క్వింటాళ్ల ధాన్యం! తాను ఆ మోరీలోంచి ఎంత ధాన్యమని ఎత్తిపోయగలదు? అయినా.. ఆగని తన కన్నీటి ధార తరహాలోనే మోరీ నీళ్లలోకి గంప ముంచడం.. వడ్లను ఆమె ఎత్తిపోయడం ఆగడం లేదు!! సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో కేడిన తారవ్వ అనే రైతును ఇలా చూసిన వారి గుండెలు ద్రవించాయి. రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన మిగతా 2లో.




# బ్రీత్ ఎనలైజర్ ఒక్కటే ఆధారం కాదు..

## తెలంగాణ హైకోర్టు

**నిర్ధారణ కోసం రక్త, మూత్ర పరీక్షలు తప్పనిసరన్న కోర్టు**

**టీజీఎస్ఆర్టీసీ డ్రైవర్ తొలగింపు కేసులో ఈ వ్యాఖ్యలు**

**కేవలం బ్రీత్ టెస్ట్ ఆధారంగా ఉద్యోగిని తొలగించడం చెల్లదని తీర్పు**

**ఇది ప్రాథమిక ఆధారమే కానీ తుది రుజువు కాదని వెల్లడి**

2లో.

# జూబ్లీహిల్స్‌లో ఓడిస్తేనే గ్యారెంటీలు అమలు

## : కాంగ్రెస్‌పై కేటీఆర్ ఫైర్

**కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ మరోసారి ట్విట్టర్ దాడి**

**జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపు**

**ఉపఎన్నికల కోసమే కాంగ్రెస్ ఆపదమొక్కులు మొక్కుతోందని విమర్శ**



2లో.

# మంత్రివర్గ విస్తరణను వెంటనే ఆపాలి

## జూబ్లీహిల్స్ ఓటర్లను ప్రభావితం చేసే చర్య

**అజారుద్దీన్‌కు పదవి కేవలం మైనార్టీలను దువ్వడమే**

**ఎన్నికల అధికారికి బిజెపి నేతల ఫిర్యాదు**

హైదరాబాద్,**అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):** జూబ్లీహిల్స్ ఓటర్లను ప్రభావితం చేసేలా చేస్తున్న మంత్రివర్గ విస్తరణను ఆపాలని బిజెపి ఎన్నికల సంఘాన్ని కోరింది. ఇది కేవలం ఓ వర్గం వారిని మచ్చిక చేసుకునే చర్య తప్ప మరోటి కాదని పేర్కొంది. ఓ వర్గం ఓట్ల కోసమే ఇప్పుడు మంత్రివర్గ విస్తరణ చేపట్టారని విమర్శించారు.



మిగతా 2లో.

# తుపాను నష్టం 5,265 కోట్లు

**ముందస్తు చర్యలతో నష్టాన్ని నివారించాం**

**అధికారులు సమన్వయంతో పనిచేయడంతో తప్పిన ముప్ప**

**అధికారులతో సమీక్షించిన సిఎం చంద్రబాబు**

అమరావతి,**అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):** 'మొంథా' తుపాను వల్ల రాష్ట్రానికి రూ.5,265 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మొంథా తుపాను బీభత్సాన్ని ముందుగానే అంచనా వేశామని, అందుకే నష్టం తగ్గిందన్నారు. వ్యవసాయ రంగానికి రూ.829 కోట్లు, ఆర్అండ్‌బీకి రూ.2,079 కోట్ల మేర నష్టం వాటిల్లిందని చెప్పారు.



మిగతా 2లో.

# బ్రీత్ ఎనలైజర్ ఒక్కటే ఆధారం కాదు.. : తెలంగాణ హైకోర్టు

**హైదరాబాద్,అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):**
బ్రీత్ ఎనలైజర్ (శ్వాస పరీక్ష) పరీక్షలో మద్యం తాగినట్టు తేలినంత మాత్రాన దానిని తుది నిర్ధారణగా పరిగణించలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. కేవలం ఈ ఒక్క పరీక్ష ఆధారంగా ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం చెల్లదని బుధవారం కీలక తీర్పు వెలువరించింది. బ్రీత్ టెస్ట్ ఫలితాలను నిర్ధారించేందుకు తప్పనిసరిగా రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించాలని తేల్చి చెప్పింది. టీజీఎస్ఆర్టీసీ డ్రైవర్ ఎ. వెంకటి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ నమవరపు రాజేశ్వర్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం జిల్లా మధిర డిపోలో పనిచేస్తున్న వెంకటి, మద్యం తాగి డిపో వద్ద నిరసనలో పాల్గొన్నారని ఆరోపిస్తూ టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం అతడిని విధుల నుంచి తొలగించింది. అతడి చర్యల వల్ల ఆర్టీసీకి రూ. 18,532 నష్టం వాటిల్లిందని, సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిందని ఆర్టీసీ వాదించింది. విచారణలో, బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో వెంకటికి 329 ఎంజీ/100 ఎంఎల్ రీడింగ్ నమోదైందని, ఇది మద్యం తాగినట్టు చెప్పడానికి ప్రత్యక్ష, శాస్త్రీయ ఆధారమని ఆర్టీసీ తరపు న్యాయవాది వాదించారు. అందుకే క్రమశిక్షణ చర్యలు సరైనవేనని సమర్థించుకున్నారు. అయితే, ఈ వాదనతో హైకోర్టు ఏకీభవించలేదు. ఇలాంటి కేసులోనే 2015లో హైకోర్టు ఇచ్చిన తీర్పును జస్టిస్ రాజేశ్వర్ రావు ప్రస్తావించారు. రక్త, మూత్ర పరీక్షల వంటి నిర్ధారణ పరీక్షలు లేకుండా కేవలం బ్రీత్ ఎనలైజర్ నివేదిక ఆధారంగా మద్యం తాగినట్టు రుజువు చేయలేమని ఆయన స్పష్టం చేశారు. కేవలం శ్వాస పరీక్ష నివేదికను ఆధారం చేసుకుని పిటిషనర్‌ను ఉద్యోగం నుంచి తొలగించడం నిలవదని కోర్టు పేర్కొంది. బ్రీత్ ఎనలైజర్ నివేదికలు కేవలం ప్రాథమిక ఆధారంగా మాత్రమే ఉపయోగపడతాయని, తదుపరి వైద్య పరీక్షలకు మార్గం సుగమం చేస్తాయని స్పష్టం చేసింది.

# అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

**(మొదటి పేజీ తరువాయి)**
శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తానని సీఎం రేవంత్ తెలిపారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇవాళ్టి వరంగల్ పర్యటనను వాయిదా వేసుకున్నట్లు చెప్పారు. తుపాను ప్రభావిత జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. దానికి అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని సీఎం తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని తెలిపారు. దీనిపై ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. రోడ్లపై బ్రిడ్జిలు, లోలెవల్ కాజ్‌వేల వద్ద వరద నీరు నిలిచినా, రోడ్లు దెబ్బతిన్నా.. ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయాలని అధికారులకు సీఎం రేవంత్ సూచించారు. అవసరమైతే తప్ప ప్రజలు రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైనచోట అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అవసరమైన చోట హైడ్రా సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. 24 గంటలు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.
అధికారులతో సమన్వయం చేసుకుని ఉమ్మడి జిల్లాల మంత్రులు, కలెక్టర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అలాగే.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సంబంధిత జిల్లా ఇంచార్జ్ మంత్రికి తెలియజేయాలని పేర్కొన్నారు. కాలువలు, వాగులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ప్రాజెక్టుల ఇన్ ఎ÷-లో, అవుట్ ఎ÷-లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వివరించారు. ప్రాణనష్టం, పశు నష్టం, పంట నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏ ఒక్కరి ప్రాణాలకు నష్టం జరగడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇవాళ్టి వరంగల్ ఆకస్మిక పర్యటన వాయిదా వేసుకున్నట్లు రేవంత్ వెల్లడించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అధికారులు బాధితులను ఆదుకునే ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# తుపాను నష్టం 5,265 కోట్లు

**(మొదటి పేజీ తరువాయి)**
తుపాను వల్ల ఎవరూ ప్రాణాలు కోల్పోలేదన్న ఆయన.. 120 పశువులు మృత్యువాత పడినట్లు పేర్కొన్నారు. నీటిపారుదల శాఖకు సంబంధించి ఈసారి నష్టం తక్కువే ఉందన్నారు. తుపాను నష్టంపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. నష్టం వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి కుటుంబాన్ని, ఇంటినీ జియోట్యాగింగ్ చేయగలిగాం. తుపాను వల్ల మారుతున్న పరిణామాలకు తగ్గట్లుగా నిర్ణయాలు తీసుకున్నాం. గతంలో విద్యుత్ సరఫరా ఆగితే 10 గంటల వరకు వచ్చేది కాదు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా ఆగినా 3 గంటల్లోనే పునరుద్ధరణ జరిగింది. అధికారులు అందరూ నిబద్ధతతో పని చేశారు. చాలా సంతోషంగా ఉందన్నారు. . ఓ వైపు వర్షం పడుతున్నా.. కూలిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించి ఇబ్బందులు లేకుండా చేశారు. గతంలో చెట్లు కూలితే.. తొలగించేందుకు వారం పట్టేది. ప్రకృతి విపత్తులను ఎవరూ ఆపలేరు.. ముందస్తు చర్యల వల్ల నష్టాన్ని తగ్గించవచ్చని చంద్రబాబు తెలిపారు. మొంథా తుపాన్ మనతో దాగుడుమూతలు ఆడి.. సమస్యలు సృష్టించిందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. అయితే టెక్నాలజీ సాయంతో ఈ తుపాన్ నష్టాన్ని తగ్గించామని ఆయన చెప్పారు. అంతర్వేది వద్ద తీరం దాటడంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయన్నారు. శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా తుపాన్ పరిస్థితిని అంచనా వేశామన్నారు. అంతర్వేది వద్ద తీరం దాటి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయని చెప్పారు. అయితే కాకినాడలో ఈ తుపాన్ క్రాస్ చేస్తుందని అనుకున్నామని.. కానీ చివరకు నరసాపురం వద్ద తీరం దాటిందని సీఎం చంద్రబాబు వివరించారు. వారం రోజుల్లోనే పరిస్థితులను చక్కదిద్దామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేశామని.. అయితే అనుకున్న చోట కాకుండా వేరే ప్రాంతాల్లో వర్షాలు కురిశాయని వివరించారు. ఈ తుపాన్ తీరం దాటినా.. తెలంగాణలో వర్షాలు అధికంగా కురిశాయని తెలిపారు. గతంలో బుడమేరు వరదను సైతం ఎదుర్కొన్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేశామన్నారు. విపత్తుల సమయంలో అన్నింటినీ సరిచేశామని చెప్పారు. ఇక గ్రామ, వార్డు సచివాలయాలను యాక్టివ్ చేశామన్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలో అధికంగా వర్షాలు పడ్డాయని తెలిపారు. వర్షాల వల్ల వరదలు వచ్చాయని.. పులిచింతల వద్ద భారీగా వరద నీరు వచ్చి చేరిందని వివరించారు. పంట నష్టంపై నివేదిక అందజేయాలని అధికారులను సీఎం చంద్రబాబు కోరారు. ఐదు రోజుల్లో పంట నష్టంపై నివేదిక అందజేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ తుపాన్ కారణంగా.. వరి, మొక్కజొన్న, పత్తి, అరటి, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే.

# దెబ్బతిన్న పంటలు



**(మొదటి పేజీ తరువాయి)**
వడ్లన్నీ నీటిపాలయ్యాయంటూ నష్ట పరిశీలనకు వచ్చిన సిద్దిపేట కలెక్టర్ హైమావతి కాళ్లపై పడి తారవ్వ బోరున విలపించింది. 150 క్వింటాళ్ల ధాన్యం మొత్తం కొట్టుకుపోయిందని.. రూ. 2.50 లక్షల పెట్టుబడి మట్టిపాలైందని రోదించింది.. 15 రోజుల క్రితం అల్లుడు చనిపోయాడని, ఇప్పుడు పండించిన పంట కూడా వరదపాలైందని.. తనను సర్కారు ఆదుకోవాలంటూ ఆమె వేడకుంది. మార్కెట్‌యార్డుకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్, తారవ్వను ఓదార్చారు. తక్షణసాయం కింద ఆమెకు రూ. 10వేలు అందజేశారు. జిల్లెలగడ్డకు చెందిన లావుడ్య నీలా అనే మహిళా రైతు.. తాను ఆరు ఎకరాల్లో పండించిన పంటంతా వరదలో కొట్టుకపోయిందని కన్నీరుమున్నీరైంది. కొందరు రైతులు డ్రైనేజీలో కొట్టుకపోయిన ధాన్యాన్ని జేసీబీతో ఎత్తుకున్నారు. మార్కెట్ యార్డులో ఏ రైతును కదిలించినా ఇలా హృదయవిదారక దృశ్యాలే కనిపించాయి. రాష్ట్రవ్యాప్తంగా రైతుల పరిస్థితి దాదాపు తారవ్వ మాదిరిగానే ఉంది. కొనుగోలు కేంద్రాల్లో, రోడ్లపైన ఆరబెట్టిన ధాన్యం వరదపాలవ్వడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం శ్రీశైలం డ్యాం వెనుక వైపున మత్స్యకారుల కాలనీ దారిపై కొండచరియలు విరిగిపడ్డాయి. శ్రీశైలం-హైదరాబాద్ హైవేలో నాగర్‌కర్నూల్ జిల్లా డిండి ప్రాజెక్టు వద్ద బ్రిడ్జి 500 అడుగుల మేర కోతకు గురైంది.
సిద్దిపేట జిల్లాలోని అక్కన్నపేట మండలం మోత్కులపల్లె వాగు దాటుతూ బైక్‌పై వెళుతున్న భార్యాభర్తలు ప్రవాహంలో కొట్టుకుపోయారు. దంపతులను ఇసంపల్లి ప్రణయ్, కల్పనగా గుర్తించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వరంగల్ ఎస్ఆర్ నగర్‌లో ఇంట్లోకి వరద నీరు చేరడంతో అనారోగ్యంతో కదల్లేని స్థితిలో ఉన్న ఆడెపు కృష్ణమూర్తి (75) అనే వృద్ధుడు పడుకున్న మంచం నీళ్లలో మునిగింది. ఆ నీటిలోనే మునిగి కృష్ణమూర్తి మృతిచెందారు. ఇంట్లో ఆయన ఒక్కరే ఉంటున్నారు. మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లి సమీపంలోని మెట్లతండా వద్ద జంపన్నవాగులో రెడ్యాలకు చెందిన పులిగుజ్జు సంపత్ (30) అనే వ్యక్తి గల్లంతై మృతిచెందాడు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కోనాయిచలం వద్ద బోళ్ల మత్తడి వాగు ఉధృతికి బైక్‌పై వెళుతున్న బక్క శ్రావ్య (18), శివకుమార్ అనే ప్రేమజంట కొట్టుకుపోయింది. శ్రావ్య గల్లంతైంది. శివకుమార్ ఈదుకుంటూ బయటకొచ్చాడు. వరంగల్ జిల్లా గీసుకొండ సమీపంలోని ఓ మోరీలో అనిల్ కుమార్ (30) అనే వ్యక్తి మృతదేహం లభ్యమైంది. వరంగల్ జిల్లా గూడూరు మండలం గాజులగుట్టలో గోడ కూలి కోల రామక్క (65) అనే మహిళ మృతిచెందింది. రంగారెడ్డి జిల్లా బాటసింగారం వద్ద వాగులో బైక్‌పై వెళుతూ కృష్ణవేణి (44) అనే అంగన్‌వాడీ టీచర్ కొట్టుకుపోయి మృతిచెందింది. వరంగల్ జిల్లా ధర్మాసాగర్ మండలం ముప్పారంలో రెండు ఆవులు, ఒక గేదె మృతిచెందాయి. జనగామ జిల్లా వెల్దెండలో మేతకు వెళ్లిన 110 గొర్రెలు వరదలో కొట్టుకుపోయాయి. జిల్లాలోని రఘునాథపాలెంలో ఓ ఎద్దు మృతిచెందింది. మహబూబాద్ జిల్లా గూడురులో 58 గొర్రెలు మృతిచెందాయి.

## ముంపులో వరంగల్

ఉమ్మడి వరంగల్ జిల్లాను మరోసారి వరద ఉక్కిరిబిక్కిరిచేసింది. ప్రధానంగా వరంగల్, హనుమకొండ, కాజీపేటలో ఇళ్లు ఇంకా వరద ముంపులోనే ఉన్నాయి. హనుమకొండ ఇందిరాగనర్‌లోని 500 ఇళ్లను చుట్టుముట్టిన వరద అలాగే ఉంది. కొందరు పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లగా.. ఇంకొందరు ఇంటి డాబాలమీదే ఉండిపోయారు. తిండి, తాగడానికి కనీసం మంచినీళ్లయినా దొరక్క ఇబ్బంది పడ్డారు. వరంగల్ ఎస్ఆర్ నగర్, సాయినగర్, మధురానగర్, వీవర్స్ కాలనీ, ఎంహెచ్‌నగర్ తదితర కాలనీల్లో వరద నీరు తగ్గలేదు. ఖమ్మం జిల్లా మున్నేరు వాగు పరీవాహక ప్రాంతంలోని గ్రామాలు, కాలనీల్లోకి వరద నీరు చేరడంతో అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. మున్నేరు ఉధృతికి ఆటోనగర్ పరిధిలోని 200 వాహనాల రిపేరు షాపుల్లోని కార్లు నీట మునిగాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో భారీ వర్షానికి రోడ్లు వాగులను తలపించాయి. ప్రధాన రహదారికి రెండువైపుల ఉన్న దుకాణాల్లోకి వరద నీరు చేరింది. కిరాణాషాపుల్లోని సరుకులు అక్కరకు రాకుండాపోయాయి. వస్త్రదుకాణాల్లోని బట్టలు పాడయ్యాయి. ఓరుగంటి వెంకటరెడ్డి అనే ఎరువుల వ్యాపారికి చెందిన 400 యూరియా బస్తాలు వరదనీటితో తడిసిపోయాయి. పట్టణంలోని రోడ్లు కోతకు గురై ఇసుకమేటలు పెట్టాయి. నెహ్రూ రోడ్డు పక్క కాలనీల్లో ఇళ్ళలోకి నీరు చేరింది. సెల్లార్లలో నీటిని మోటార్లతో ఎత్తిపోశారు.

# మంత్రివర్గ విస్తరణను వెంటనే ఆపాలి

**(మొదటి పేజీ తరువాయి)**
అజారుద్దీన్ గతంలో జూబ్లీహిల్స్‌లో పోటీ చేశారని భాజపా నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రివర్గ విస్తరణను ఆపాలని సీఈవోను కోరారు. తెలంగాణ భాజపా నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డిని కలిశారు. మంత్రివర్గ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తోందని అందులో పేర్కొన్నారు. మంత్రివర్గంలోకి అజారుద్దీన్‌ను తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల నిర్ణయించారు. ఈ నెల 31న విస్తరణకు అవకాశం ఉందని, అజారుద్దీన్‌కు ఏఐసీసీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. కొందరు మంత్రుల శాఖల్లో మార్పులు జరగవచ్చని కూడా తెలుస్తోంది. ఈక్రమంలో సీఈవోను భాజపా నేతలు కలిసి ఫిర్యాదు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడంపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మర్రి శశిధర్ రెడ్డితో పలువురు బీజేపీ ప్రతినిధులు ఎన్నికల అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కోడ్ ఉల్లంఘించారని ఆరోపించారు. ఇలా మంత్రి పదవి ఇవ్వడం వల్ల ఒక వర్గం ఓట్లు ప్రభావితం అవుతాయ న్నారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. 'మంత్రివర్గ విస్తరణపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం, చర్యలు తీసుకోవాలని కోరాం. ఒక వర్గానికి మంత్రి పదవి ఇచ్చి రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారని అంటూ పాయల్ శంకర్ అన్నారు. ఒకవేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వాలి అనుకుంటే ఎన్నిక తర్వాత ఇవ్వాలి. కానీ ఉన్నఫళంగా మంత్రివర్గ విస్తరణ చేయడం, అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం వెనక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఈ అంశాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. మర్రి శషిధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల లబ్ది కోసం ఒక వర్గం ఓట్లు కోసం అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇస్తున్నారు. ఆ వర్గంపై ప్రేమ ఉంటే గతంలో ఎందుకు ఇవ్వలేదు. మంత్రి పదవి ఆశ చూపి ఆ వర్గాన్ని మోసం చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. కోడ్ ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాలంటూ కోరాం. సినీ కార్మికులను ప్రభావితం చేసేలా ప్రకటనలు చేయడంకోడ్ ఉల్లంఘనే అవుతుందన్నారు.

# నేడు తెలంగాణకేబినేట్ విస్తరణ

**(మొదటి పేజీ తరువాయి)**
22 నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత మరో ముగ్గురికి మంత్రులుగా అవకాశం ఇవ్వడంతో కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. ఇక మిగిలిన మూడు మంత్రి పదువులపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేసింది. ఈ మూడు మంత్రి పదవుల్లో మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇవ్వాలని హైకమాండ్ భావించింది. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పేరును అధిష్టానం ఖరారు చేసింది. అజారుద్దీన్‌కు హోం, మైనారిటీ శాఖ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక మంత్రివర్గంలో మరో రెండు ఖాళీలకు అధిష్టానం ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందో చూడాలి మరి. కాగా.. మైనారిటీని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఎప్పటి నుంచో ఆలోచన ఉందని.. అందులో భాగంగానే అజారుద్దీన్ కేబినెట్‌లోకి తీసుకుంటున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ చెప్పిన విషయం తెలిసిందే. అయితే తనకు హామీ ఇచ్చి పక్కన పెట్టారని రాజగోపాల్ రెడ్డి పదేపదే విమర్శలు చేస్తున్నా ఆయనకు మాత్రం అవకాశం దక్కకపోవడం గమనార్హం.

# వరల్డ్ కప్ ఫైనల్లోకి

**(మొదటి పేజీ తరువాయి)**
జెమీమా రోడ్రిగ్స్ (127 నాటౌట్) అద్భుత సెంచరీతో చెలరేగడంతో, 339 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ మరో ఓవర్ మిగిలి ఉండగానే 341/5 స్కోరుతో ఛేదించింది. ఈ విజయంతో భారత్ మూడోసారి ప్రపంచకప్ ఫైనల్‌కు చేరగా, ఆస్ట్రేలియా 15 మ్యాచ్‌ల విజయ పరంపరకు తెరపడింది. అంతేకాకుండా, మహిళల, పురుషుల వన్డే ప్రపంచకప్ నాకౌట్ చరిత్రలోనే ఇది అత్యధిక విజయవంతమైన ఛేదనగా రికార్డు సృష్టించింది. 2015 పురుషుల ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాపై న్యూజిలాండ్ ఛేదించిన 299 పరుగుల రికార్డును భారత్ అధిగమించింది. భారీ లక్ష్య ఛేదనలో భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (10), స్మృతి మంధన (24) త్వరగా ఔటవ్వడంతో 47 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన జెమీమా రోడ్రిగ్స్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (89)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. వీరిద్దరూ ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ మూడో వికెట్‌కు 167 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. మహిళల ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై ఇదే అత్యధిక భాగస్వామ్యం కావడం విశేషం. హర్మన్‌ప్రీత్ ఔటైన తర్వాత కూడా జెమీమా ఒత్తిడికి గురికాలేదు. దీప్తి శర్మ (24), రిచా ఘోష్ (26), అమన్‌జోత్ కౌర్ (8 బంతుల్లో 15 నాటౌట్) కీలక సమయాల్లో రాణించి ఆమెకు మద్దతుగా నిలిచారు. అమన్‌జోత్ ఫోర్‌తో విజయ లాంఛనాన్ని పూర్తి చేయగా, జెమీమా ఆనందంతో కన్నీటిపర్యంతమైంది. ఇది ఆమెకు ప్రపంచకప్‌లో తొలి సెంచరీ కావడం గమనార్హం. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 338 పరుగుల భారీ స్కోరు చేసింది. ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (119) సెంచరీతో కదం తొక్కగా, ఎల్లీస్ పెర్రీ (77), ఆష్లే గార్డనర్ (45 బంతుల్లో 63) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. భారత బౌలర్లలో నల్లపురెడ్డి శ్రీ చరణి, దీప్తి శర్మ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, అద్భుతమైన పోరాట పటిమతో విజయం సాధించిన భారత జట్టుపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది.

# జూబ్లీహిల్స్‌లో ఓడిస్తేనే గ్యారెంటీలు అమలు

## : కాంగ్రెస్‌పై కేటీఆర్ ఫైర్

**హైదరాబాద్,అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):**
కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీని ఓడించడం ద్వారానే, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన వరుస ట్వీట్లు చేశారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ కూడా దక్కకుండా చిత్తుగా ఓడించాలని కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. అలాంటి ఓటమి రుచి చూస్తేనే అధికార పార్టీకి భయం పట్టుకుంటుందని, అప్పుడే పెండింగ్‌లో ఉన్న హామీల అమలుపై దృష్టి పెడుతుందని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయి వాస్తవాలు అర్థమవుతున్నాయని ఆయన ఎద్దేవా చేశారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ 'ఆపదమొక్కులు' మొక్కుతోందని కేటీఆర్ విమర్శించారు. పార్టీ పరువు కాపాడుకోవడం కోసమే రకరకాల ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే సినీ కార్మికులకు కొత్త వాగ్దానాలు చేయడం, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోనుండడం, మంత్రులు గతంలో ఎన్నడూ లేనంత హడావుడిగా హైదరాబాద్ వీధుల్లో తిరగడం వంటివి చేస్తున్నారని ఆరోపించారు. ఇవన్నీ కాంగ్రెస్ తీవ్ర ఒత్తిడిలో ఉందనడానికి నిదర్శనమని కేటీఆర్ తెలిపారు. ఈ ఉపఎన్నికలో ప్రజలు కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెబితేనే, రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# మున్నేరు వాగు ఉధృతి

. ఖమ్మం నగరం సమీపంలోని దంసలాపురం వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై మూడు అడుగుల మేర వచ్చింది. దీంతో పోలీసులు ఆ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. చింతకాని మండలం రామకృష్ణాపురం సమీపంలో లో లెవెల్ వంతెనపై వరద ప్రవహిస్తోంది. పాలేరు జలాశయానికి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. ఖమ్మంలోని రాపర్తి నగర్ బీసీ కాలనీ వద్ద డంపింగ్ యార్డుకు వెళ్లే రహదారి కొట్టుకుపోయింది. టీఎన్జీవోస్ కాలనీని నలువైపులా వరద నీరు ముంచెత్తడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్నేరు పరివాహక ప్రాంతంలోని ఏదులాపురం పరిధిలో కేబీఆర్ నగర్, ప్రియదర్శిని కళాశాల ప్రాంతంలో ఉన్న ఇళ్ల చుట్టూ వరద నీరు చేరింది.

# నీట మునిగిన పంటలను,తడిసిన మక్కలు పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి.

**బయ్యారం/అక్టోబర్ 30(జర్నలిస్ట్ వార్త):** మండల వ్యవసాయ అధికారి కే.రాజు,వ్యవసాయ విస్తరణాధికారులు మండలంలోని బయ్యారం, జగ్గుతండా,నామాలపాడు,కోటగడ్డ, పందిపంపుల గ్రామాలలో ప్రాథమిక పంట నష్టాన్ని అంచనా వేయుటకు గురువారం గ్రామాల్లో పర్యటించారు.

పాకాల వాగు,పందిపంపుల వాగు పరిసర ప్రాంతాల్లోని వరి పంటలు నీట మునిగినట్లు తెలిపారు.మొత్తం 2,488 ఎకరాల వరి పంట 1,639 మంది రైతులకు చెందినది, 192 ఎకరాల పత్తి పంట 154 మంది రైతులకు చెందినదిగా గుర్తించినట్లు తెలిపారు.ప్రాథమిక పంట నష్టం గుర్తించి వ్యవసాయ కమిషనరేట్‌కు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా అధికారులు రైతులను కలసి,తుఫాన్ విపత్కర పరిస్థితి గురించి వివరిస్తూ,రైతులను ఓదార్చి వ్యవసాయ శాఖ సంచాలకుల కార్యాలయం నుండి అనుమతి లభించిన వెంటనే క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా పూర్తి స్థాయి పంట నష్టం లెక్కింపు (ఎన్యుమరేషన్) చేపడతామని,అర్హులైన రైతులకు




పంట నష్ట పరిహారం అందచెయ్యడం జరుగుతుందని మండల రైతులకు ఏఓ రాజు హామీ ఇచ్చారు. రహదారులపై మొక్కజొన్న పంటను ఆరబెట్టుకుంటున్న రైతులతో మాట్లాడి,పంటను వర్షం నుండి రక్షించుకునే విధంగా టార్పాలిన్‌లతో కప్పి సురక్షితంగా ఉంచాలని సూచించారు.బయ్యారం పెద్ద చెరువు ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.ప్రస్తుతం పరిస్థితి సజావుగా ఉందనీ,అలిగేరు పూర్తిగా నియంత్రణలో ఉందనీ తెలిపారు.మండలంలోని రైతులు ప్రస్తుత



వర్షాలు,తుఫాన్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారులు నాగరాజు, తేజస్విని,ఫయాజ్,అఖిల్, రైతులు భాస్కర్ రెడ్డి,వెంకటనారాయణ, పగడాల శ్రీనివాస్,వన్నం రామారావు తదితరులు పాల్గొన్నారు.

# మెంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

## సిపిఎం మండల కార్యదర్శి నంబూరి మధు



**బయ్యారం/అక్టోబర్30 (జర్నలిస్ట్ వార్త):**



మండలంలోని అన్ని గ్రామాలలో బుధవారం ఎడతెరిపి లేకుండా కుండ పోత వర్షం కురుస్తూనే ఉంది. ఈ అకాల వర్షాలతో మండలంలోని అన్ని గ్రామాలలో వరి పత్తి మొక్కజొన్న పంటలు తడిసి ముద్దయినేల పాలయ్యాయి. ఆరు గాలం కష్టపడి అందిన కాడికి అప్పులు తెచ్చి కష్టనష్టాలను ఓర్చి పండించిన పంటలు చేతికి అంది వచ్చే దశలో ఈ తుఫాను ప్రభావంతో వర్షాలు కురిసి కళ్ళముందే పంటలు నీటి పాలు అవుతుంటే ఆ రైతులు తీవ్ర ఆవేదన చెందుతూ ఆందోళనకు గురవుతున్నారు.. తుఫాన్ ప్రభావం వల్ల చేతికొచ్చిన వరి పంట నీటిలో మునిగి పోయి తీవ్ర నష్టం జరిగింది నష్టపోయిన ప్రతి ఒక్క రైతుని గుర్తించి ఎకరాకి 50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ క్షేత్రస్థాయిలో పర్యటన

## వరద ముంపు ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలకు ఆదేశాలు

**హనుమకొండ/బ్యూరో / అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):ద**



గత రెండు రోజులుగా కురుస్తున్న అతివృష్టి కారణంగా హనుమకొండ నగరం జలమయమైంది. పలు కాలనీలు వరద ముంపుకు గురవడంతో జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని వ్యక్తిగతంగా సమీక్షించడానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు.వరద తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రగతి నగర్, వివేక్ నగర్, అమరావతి నగర్, సమ్మయ్య నగర్, 100 ఫీట్ల రోడ్ పరిసర ప్రాంతాల్లో కలెక్టర్ స్వయంగా చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఎస్డిఆర్ఎఫ్, డిఆర్ఎఫ్ బృందాలకు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.హంటర్ రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్ సమీపంలో వరదలో ఇరుక్కున్న కుటుంబాన్ని కలెక్టర్ స్వయంగా అక్కడికి వెళ్లి, డిఆర్ఎఫ్ బృందం సాయంతో బోటులో రక్షించి పునరావాస కేంద్రానికి తరలించారు.సీఎస్ఆర్ గార్డెన్ సమీపంలోని సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలలో ముంపు తీవ్రంగా ఉండడంతో 470 మంది విద్యార్థినులను లైఫ్ బోట్ల సాయంతో సురక్షిత ప్రదేశాలకు తరలించాలని ఆమె ఆదేశించగా, అధికారులు, సహాయక బృందాలు సమయానికి చర్యలు తీసుకున్నాయి.కలెక్టర్ మాట్లాడుతూప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రతి శాఖ సమన్వయంతో పని చేయాలి. ముంపు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించి అవసరమైన సదుపాయాలు కల్పించాలి," అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ, కాజీపేట తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, భావు సింగ్, సూపరింటెండెంట్ జగత్ సింగ్, కిరణ్ కుమార్, జీవిడబ్ల్యుఎంసీ సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ శ్యాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాసరెడ్డి దీక్షకు మద్దతు పలికిన భాజపా నాయకులు

## -బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు నాయిని శ్రీనివాస్.

**బయ్యారం/అక్టోబర్ 30(జర్నలిస్ట్ వార్త):** బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డిపై దాడికి నిరసన దీక్ష చేస్తున్న శ్రీనివాస్ రెడ్డికి మద్దతుగా బయ్యారం మండలం భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు నాయిని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్, వన్నం రామారావు, బొల్లెపెల్లి వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రెటరీ ఊకే రామ్మూర్తి, బీజ్జ కనకయ్య, కురియాల చంద్రయ్య, నిరసన దీక్షలో కూర్చొని మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా మండల నాయకులు నాయిని శ్రీనివాస్, వన్నం



రామారావు మాట్లాడుతూ బయ్యారం మండలంలో గత కొంత కాలం నుండి అరాచక శక్తుల అకృత్యాలు ఎక్కువ అయ్యాయని కాంగ్రెస్ పార్టీ కోసం పార్టీ కష్ట కాలంలో పని చేసిన పార్టీ బాద్యుడిపై భౌతిక దాడి చేసి 44 రోజులు అవుతున్న నిందితులని ఎందుకు రిమాండ్ చెయ్యలేదు అని, అధికార బలంతో కేసును పక్క దొవ పట్టించే విషయం తెలిసిదే.రోడ్డుపై నిరసన దీక్ష చేయడం అది అధికార పార్టీ నాయకుడు రోడ్డు ఎక్కడం ఏమిటీ అని ఇదేనా ప్రజా పాలన అంటూ కాంగ్రెస్ పార్టీ నాయకునికే రక్షణ లేదని సామాన్యుల పరిస్థితి ఏమిటి అని అన్నారు.దొషులని శిక్షంచే వరకు ఊరుకునే ప్రసక్తి లేదని తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు రౌడీ ముదిరి రాజకీయ నాయకులు అవుతున్నారని పోలీస్ వారు శాంతి భద్రతలని కాపాడాలని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని దొషులని వెంటనే రిమాండ్ చేయాలని భారతీయ జనతా పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నాం అన్నారు.

# మంచితనానికి మారుపేరు ఎంపీడీవో కిషన్

## -ఎంపీడీవో పై నిరాధార ఆరోపణలు సరికాదు



**రాయపర్తి/అక్టోబర్ 30(జర్నలిస్ట్ వార్త):** మంచితనానికి మారుపేరు ఎంపీడీవో కిషన్ అని మండల పంచాయతీ అధికారులు తెలిపారు.రాయపర్తి మండల ఎంపీడీవో పై టైపిస్టు స్వప్న మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయడంపై గురువారం మండల పంచాయతీ కార్యదర్శులు స్పందిస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ఎంపీడీవో కిషన్ ఒక అధికారిగానే కాకుండా ఒక మంచి మనిషిగా మాపై ఆధార అభిమానాలు చూపించేవాడని అన్నారు.అలాంటి వ్యక్తిపై అసత్య ఆరోపణలు చేయడం సరి కాదని వారు అన్నారు.ఎంపీడీవో కిషన్ గత 4 సంవత్సరాలు విధులు నిర్వర్తిస్తున్నారని వృత్తి పరంగా అందరిని ప్రోత్సహిస్తూ సహాయ సహకారాలు అందించే వాడని అన్నారు.రాయపర్తి మండలాన్ని జిల్లా లోనే అగ్రగామిగా నిలిపెండెకు ఎంతో కృషి చేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కరుణశ్రీ, సుమలత,లక్ష్మీదేవి,జయంతి,నర్సయ్య,రాజు,శ్రీనివాస్,సత్యనారాయణ, పద్మనాభ స్వామి,మహేందర్,వినోద్ కుమార్,రాకేష్ అంబేద్కర్,పవన్ సాగర్, విజేందర్, శంతిరాజ్,తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ దెబ్బకు రైతులు ఆందోళన

## వందల ఎకరాల్లో పంట నష్టం - ప్రభుత్వం సహాయం చేయాలని డిమాండ్

**హనుమకొండ బ్యూరో/ అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):**వరంగల్ ఉమ్మడి జిల్లాలో బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల వల్ల రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. వరి, పత్తి పంటలు నీట మునిగిపోవడంతో నేల వాలిపోయి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వందల ఎకరాల్లో పంటలు నష్టపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

అలుగుబారుతున్న చెరువులు, పొలాలు నీటమునిగిపోవడంతో పంటలు పాడైపోతున్నాయి. ఎంతో కష్టపడి వేసిన పంటలు కళ్లముందే నాశనం కావడం రైతులను ఆవేదనకు గురిచేస్తోంది. తుఫాన్ ప్రభావంతో కలిగిన నష్టాన్ని ప్రభుత్వం తక్షణమే అంచనా వేసి, రైతులకు నష్టపరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.ధర్మసాగర్ మండలంలో పంటల నష్టాన్ని తగ్గించుకునే సూచనలు చేసిన టీవీఆర్‌కే శాస్త్రవేత్తలు మొంతా తుఫాన్ ధాటికి హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని పలు గ్రామాల్లో వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులను పరామర్శించిన టీవీఆర్‌కే వరంగల్ శాస్త్రవేత్తలు డాక్టర్ విజయభాస్కర్, విశ్వతేజ, మండల వ్యవసాయ



అధికారి రాజేష్, విస్తరణాధికారి హరీష్ పంటల స్థితిని పరిశీలించి, రైతులకు తగు సూచనలు అందించారు.

**వరి పంటలకు సూచనలు :**

వర్షం తగ్గిన వెంటనే పొలాల్లో నిల్వ నీటిని బయటకు పంపాలని శాస్త్రవేత్తలు సూచించారు. కిందపడిన వరి మొక్కలను కట్టలుగా కట్టి నీరు ఆరిపోయేలా చూడాలని సూచించారు. నీటిలో తడిసిన గింజ రంగు మారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తెగుళ్ల నివారణకు ఒక గ్రాము కార్బెండజమ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కోసిన ధాన్యం మొలకెత్తకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణంతో పిచికారీ చేయాలని తెలిపారు.

**పత్తి పంటలకు సూచనలు :**

తడి పత్తిని ఏరరాదని, పొడి ప్రదేశంలో మాత్రమే ఏరాలని



రైతులకు సూచించారు. ఏరిన పత్తిని ప్లాస్టిక్ కవరుపై ఆరబెట్టాలని, తడి పత్తిని నిల్వ చేస్తే బూజు పట్టి రంగు మారి నాణ్యత దెబ్బతింటుందని హెచ్చరించారు. రాగడి నేలల్లో అధిక తేమ కారణంగా కాయలు కుళ్లిపోకుండా ప్రాపికొనాజోల్ 200 మిల్లీలీటర్లు మందును ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు.

శాస్త్రవేత్తలు రైతులు తుఫాన్ అనంతరం పంటల సంరక్షణలో తగు జాగ్రత్తలు తీసుకుంటే నష్టాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు.

# ఉప్పరపెల్లి యువత సిపిఐలో చేరిక

## ప్రజా ఉద్యమాలకు ఆకర్షితులై 21 మంది సభ్యత్వం



**వర్ధన్నపేట/అక్టోబర్ 30:(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం ఉప్పరపెల్లి గ్రామానికి చెందిన 21 మంది యువతులు, యువకులు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)లో చేరారు. ఈ కార్యక్రమం జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఆరెల్లి ప్రభాకర్, మండల సహాయ కార్యదర్శి బొడ్డుపెల్లి సాయిలు ఆధ్వర్యంలో జరిగింది.

పార్టీ చేపడుతున్న వివిధ ప్రజా ఉద్యమాలు, రైతాంగ పోరాటాలు తమను ఆకట్టుకున్నాయని కొత్తగా చేరిన సభ్యులు తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా 5 వేల మందికి పైగా ప్రాణత్యాగాలు, 15 లక్షల ఎకరాల భూమి పంచడం, 25 వేల మంది జైలు జీవితాలు అనుభవించడం వంటి ఘన చరిత్ర



సిపిఐకే చెందిందని వారు పేర్కొన్నారు.

సభ్యత్వం పొందిన వారిలో గ్రామ కార్యదర్శి సినపెల్లి యాకయ్య, సహాయక కార్యదర్శులు తాటికాయల మహేందర్, కట్ట బాలకృష్ణ, కోశాధికారి తమ్మడబోయిన బిక్షపతి, సభ్యులు సినపెల్లి దేవయ్య, బాస్కూరి బాబు, బాన్కూరి కొమురయ్య, కట్ట బాస్కర్, మంద సాయిలు, తూల్ల వెంకన్న, తూల్ల బాబు, వనునూరి సాంబయ్య, చెల్కలపెల్లి సమ్మయ్య, బొమ్మెర కుమార్, సినపెల్లి ఎల్లయ్య, సినపెల్లి ఏలియ, బాన్కూరి కొమురయ్య తదితరులు ఉన్నారు.

# దెబ్బతిన్న పంటలను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**రాయపర్తి/అక్టోబర్ 30(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని ఊకల్, మైలారం గ్రామాలలో మొంతా తుఫాన్ కారణంగా బుధవారం కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న పంటలను, ఊకల్ కొండాపురం మధ్య ధ్వంసమైన రోడ్లను గురువారం కాంగ్రెస్ నాయకులు టిపిసిసి మాజి కార్యదర్శి బిల్లా సుదీర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావాల వలన ఏర్పడ్డ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమాచారాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి వివరించడం జరిగిందనీ తెలిపారు.మండలంలో జరిగిన పంట నష్టాలను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఫోన్ లో ఎమ్మెల్యే యశస్వి ని రెడ్డి ఆదేశించడం జరిగిందని అన్నారు.తడిసిన దాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనీ,ఇండ్లు కూలిన వారికి వెంటనే ప్రభుత్వం సహాయం అందించాలని తహసిల్దారు ను ఆదేశించార అన్నారు.పంట నష్టంఅంచనా వేసి ప్రభుత్వం కు రిపోర్ట్ పంపించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు మాచర్ల ప్రభాకర్, ఎండి నయీమ్,భూక్యా సమ్మయ్య ,కాశీనాథం, బొమ్మెర కళ్యాణ్, యాదవ్, డీజే శీను,శీను ముదిరాజ్ తడితరులు పాల్గొన్నారు.



# ఇకనైనా పట్టించుకోరా... కరువైన రక్షణ

## నాయిని శ్రీనివాస్ రెడ్డి దీక్షకు బిఆర్ఎస్ పార్టీ నాయకుల సంఘీభావం.

**బయ్యారం/ అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):**
బయ్యారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా గణేష్ ఆధ్వర్యంలో బయ్యారం మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు సెంటర్లో నాయిని శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ బయ్యారం టౌన్ ప్రెసిడెంట్ పై సొంత పార్టీకి చెందిన రౌడీ మూకలు హత్యాయత్నంలో భాగంగా దాడి చేసిన సందర్భంలో ఐదుగురుపై అయినటువంటి హత్యాయత్నం కేసులో కూడా ఈనాటికి పోలీసులు అరెస్టు చేయకపోవడం విడ్డూరంగా ఉంది ఇది ఎవరి మెప్పు కోసం..ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ప్రజలను కన్నుకు రెప్పలా కాపాడే పోలీస్ యంత్రాంగమే దాడులు నిర్వహిస్తున్న రౌడీ మూకలకు వత్తాసు పలకడం అన్యాయమైన చర్య అని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు..దీనికి ప్రత్యక్ష సాక్షమే అధికార పార్టీ నాయకులపై దాడి, దీక్ష శిబిరాలు.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సుమారు రెండు సంవత్సరాలు పూర్తి కాకముందే బయ్యారం మండలంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని రౌడీ మూకలు రాజ్యమేలే ఎటువంటి పరిస్థితి తీసుకోవలసినప్పటికీ బయ్యారంలో సామాన్యులపై జరిగే అత్యాయత్నాలు, దాడులు, ఫ్యాక్షనిజాన్ని ప్రేరేపించే విధంగా బయ్యారం మారుతుందని ఆవేదన చెందుతున్నాము.
గతంలో ఎన్ని రకాల పార్టీలు ఉన్నా నక్సలిజం ఉన్న స్వేచ్ఛ వాతావరణంలో ప్రజలు జీవనం కొనసాగించారు. ఇప్పుడున్నటువంటి పరిస్థితులలో తప్పుచేసి, అక్రమాలు చేసి, అన్యాయాలు చేసి, మోసాలు చేసి మేము చేసిందే రైట్ అనే విధంగా భయభ్రాంతులకు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అహంకారపూరితమైన రౌడీయిజాన్ని బయ్యారంలో కొనసాగిస్తుంటే ప్రభుత్వంలో భాగమైనటువంటి పోలీస్ వ్యవస్థ బయ్యారంలో ఉన్నట్ల లేనట్లా...?? అని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.
ప్రతిపక్ష పార్టీలో ఉన్న వారిని గాని, సామాన్య వ్యక్తులను



గాని అతి చిన్న విషయాల పైన స్టేషన్ కు పిలిపించి వారిపై చట్టపరమైన చర్యలకు ఏమాత్రం సమయం కూడా ఇవ్వకుండా చేసేటువంటి పోలీసు వ్యవస్థ వీరిని కాపాడే ప్రయత్నం ఎందుకు చేస్తున్నట్టు..? ఎవరి మెప్పు కోసం చేస్తున్నట్టు...?ప్రజలకు జరిగే అన్యాయం పైన చర్య తీసుకోవడం ముఖ్యమా.?? ప్రభుత్వంలో పరిపాలనలో ఉన్నటువంటి వారి యొక్క మెప్పు పొందడం ముఖ్యమా..? ఈ సమాజంలో జరిగేటటువంటి అన్యాయం అక్రమాలను దోపిడీలలో రౌడీయిజాన్ని అణిచివేయాలని చెప్పి ప్రభుత్వాలు ఎన్ని చెప్పినప్పటికీ రౌడీలకు సహకరించే పోలీసులుగా మారేటువంటి ప్రయత్నం బయ్యారంలో జరుగుతుందని ప్రజలు ఆ నోట అనుకునే పరిస్థితి ఏర్పడి ఈ మండలంలో భయభ్రాంతులకు ప్రజలు గురవుతున్నారు.దయచేసి మేము కోరుకునే విన్నపం ఈ మండలం ఒకప్పుడు ఏ విధంగా ప్రశాంతంగా అన్ని రాజకీయ పార్టీలు కలిసి ప్రశాంతమైనటువంటి వాతావరణంలో, రాజకీయాలలో ప్రజా శ్రేయస్సును నడిపించారో ఆ పద్ధతిలో ఈ మండలంలో మళ్లీ ఆ పరిపాలనలు రావాలని కోరుతున్నాము.దానికి పూర్తి బాధ్యతగా లా అండ్ ఆర్డర్ ప్రాబ్లం లో లేకుండా సక్రమమైన మార్గంలో ప్రజా శ్రేయస్సు కోరి, ప్రజల బాగోగులు కోరి వారికి జరిగే అన్యాయాలు, అక్రమాల నుంచి బయటికి తీసే అటువంటి ప్రముఖమైనటువంటి పాత్ర పోలీస్ వ్యవస్థది. కాబట్టి మీ యొక్క డ్యూటీలను గాని , చట్టం యొక్క విధానాన్ని గాని అనుసరించి ప్రజలకు న్యాయం జరిగే విధంగా ప్రయత్నం చేయాలని ఈ విధంగా నాయిని శ్రీనివాస్ రెడ్డి మరియు చల్ల గోవర్ధన్ ఇంకా కొంతమంది మిత్రులు వీరందరిపై దాడి చేసినటువంటి రౌడీ మూకల ను తక్షణమే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలందరి తరపున బిఆర్ఎస్ బయ్యారం మండల పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో గంగుల సత్యనారాయణ,బానోత్ మురళి కృష్ణ,బానోత్ లక్ష్మణ్ నాయక్,రెపాకుల వెంకన్న,, సింగారం శ్రీను, జర్పుల శ్రీను, జగన్, రాము,కీర్తి ఉదయ్,తదితరులు పాల్గొన్నారు.



# పంట నష్టం జరిగిన రైతులను ఆదుకోవాలి

**రాయపర్తి/అక్టోబర్ 30(జర్నలిస్ట్ వార్త):**మొంథా తుఫాన్ ప్రభావం వల్ల పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ శ్రీనివాస్ కు బిఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ బారి వర్షంతో నష్టపోయిన వరి,పత్తి,మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.వరి, పత్తి పంటకు పూర్తిగా నష్టం జరిగింది, మొక్కజొన్న, ఇతరపంటలు సల్పంగా దెబ్బతిన్నాయని,ధాన్యం నిల్వలు వర్షంతో తడిసునితమునిగాయని తెలిపారు.రోడ్లు, డ్యామ్ లు, కాజువేలు స్పల్పంగా, దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా మారాయని అన్నారు.పంట నష్టాన్ని పరిశీలించి రైతులకు నష్ట పరిహారం అదేవిధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి నష్ట పరిహారం ఇప్పించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.అనంతరం మండల కేంద్రంలోని వరి పంట పొలాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,లి మండల పార్టీ నాయకులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, లేతకుల రంగా రెడ్డి, గారే నర్సయ్య, గాదె రవీందర్ రెడ్డి, గుగులోత్ చందు నాయక్, అశ్రఫ్ పాషా, ఎల్లస్వామి, చందు రామ్, ఉబ్బని సింహాద్రి, ఐత రాజు, నవీన్, గుడి రాజు రెడ్డి, గుండె రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధనకై నిర్వహించు సదస్సును విజయవంతం చెయ్యాలి

### - వరంగల్ జిల్లా అధ్యక్షులు షేక్ జావిద్



**నర్సంపేట/అక్టోబర్ 30(జర్నలిస్ట్ వార్త):**42 శాతం బీసీ రిజర్వేషన్ సాధనకై నిర్వహించు సదస్సును విజయవంతం చెయ్యాలనితెలంగాణ జన సమితి పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు షేక్ జావిద్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనర్సంపేట 1/11/2025 శనివారం ఉదయం 11గం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ జరుగు 42శాంతం బి.సి రిజర్వేషన్ను కేంద్ర ప్రభుత్వం వెంటనే రిజర్వేషన్ బిల్లును 9 షెడ్యూల్లో చేర్చి బిల్లును ఆమోదించాలని తెలంగాణ జన సమితి పార్టీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బీసీ సామాజిక వర్గ ప్రజలు మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటం కేవలం భౌగోళిక రాష్ట్రం కోసం మాత్రమే కాదు భౌగోళిక రాష్ట్రం స్వరాష్ట్రం ఏర్పడితే సామాజిక ఆర్థిక రాజకీయ సమానత్వాన్ని అందించగల సామాజిక తెలంగాణ నిర్మాణ నికి పునాది పడుతుందని ఆశించినం వలసాధిపత్య పాలకుల నుంచి ముక్తి పొందిన తర్వాత సుపరిపాలన లో ప్రతి ఒక్కరిని విద్య ఉద్యోగ రాజకీయ అవకాశాలు అందుబాటులో వస్తాయని భావించి మెజార్టీగా ఉన్న సామాజిక వర్గం ఇప్పటికీ చట్టసభలో న్యాయ సమ్మతమైన ప్రాతినిధ్యాన్ని పొందలేకపోతున్నారని జావిద్ అన్నారు.

# నగరం జలమయం -అధికారుల వైఫల్యం బహిర్గతం

## హంటర్ రోడ్, బొందువాగు ప్రాంతాల్లో ప్రజలకు తీవ్ర ఇబ్బంది - సి.పి.ఐ కాజీపేట మండల సమితి మండిపాటు

**హనుమకొండ బ్యూరో/అక్టోబర్30 (జర్నలిస్ట్ వార్త):**
బుధవారం భారీ తుఫాన్ వర్షం కారణంగా వరంగల్ నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా హంటర్ రోడ్, బొందువాగు పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాల కారణంగా వర్షపు నీరు గట్టిగా నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రజలు అదనంగా ఐదు నుండి ఆరు కిలోమీటర్లు తిరిగి ప్రయాణించాల్సి రావడం సాధారణ ప్రజల జీవనంపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. ప్రజలు పడుతున్న ఇబ్బందులకు కారణం రాజకీయ పాలకుల నిర్లక్ష్యం, అలాగే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల అవగాహన లోపం అని సి.పి.ఐ కాజీపేట మండల సమితి మండిపడింది.




సమయానికి ముందస్తు చర్యలు తీసుకొని డ్రైయినేజ్ వ్యవస్థను మెరుగుపరిచి ఉంటే ఈ స్థాయి నష్టం తలెత్తేదే కాదని పార్టీ నేతలు పేర్కొన్నారు. ప్రజల పట్ల బాధ్యత చూపడంలో పాలకవర్గం పూర్తిగా విఫలమైందని వారు అన్నారు.సి.పి.ఐ పార్టీ నాయకులు నగరంలో నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అనధికార నిర్మాణాలను వెంటనే తొలగించాలని, డ్రెయినేజ్, రోడ్ల ప్రణాళికలను పునఃసమీక్షించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు.
ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల సహాయ కార్యదర్శి వేల్పుల సారంగపాణి యాదవ్, సీనియర్ నాయకుడు మునీగాల బిక్షపతి, ఎ.యస్ఎఫ్.ఐ మండలం ఇంచార్జ్ వేల్పుల చరణ్, మద్దెల శ్రీనివాస్ గౌడ్, స్థానికులు కోడం సురేష్, రఘు, దేవేందర్, రాజు, రమేష్ తదితరులు ప్రభావిత ప్రాంతాలను సందర్శించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రభుత్వము వెంటనే స్పందించి ఇలాంటి పరిస్థితులు మళ్లీ రాకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని సి.పి.ఐ కాజీపేట మండల సమితి డిమాండ్ చేసింది.

# కస్తాల సత్యనారాయణకు మాతృవియోగం

### -రామ తులిశమ్మ ఇక లేరు..

**ఖమ్మం/అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):** విశ్రాంత సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ మాతృమూర్తి స్వాతంత్ర సమరయోధురాలు కస్తాల రామ తులిశమ్మ (95) గురువారం వారి స్వగ్రామం కొండకోడిమ గ్రామంలో తుది శ్వాస విడిచారు. రామ తులిశమ్మ తన జీవితకాలంలో ఎంతోమంది పేదలకు, రైతులకు సహాయ సహకారాలు అందిస్తూ, వారి గ్రామంలో ఎంతోమంది పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సహాయం అందించేవారు. ఆమె మృతి పట్ల గ్రామ ప్రజలు, రైతులు, ఉద్యోగులు, ఉద్యోగ యూనియన్ నాయకులు శ్రద్ధాంజలి ఘటిస్తూ, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దహన సంస్కారాలు శుక్రవారం ఉదయం 10:30 గంటలకు వారి స్వగ్రామం వైరా మండలం, కొండకోడిమ గ్రామంలో నిర్వహిస్తారు.



# నల్లబెల్లి గ్రామంలో తుఫాన్ తాండవం

## - 1200 ఎకరాల వరి పంట నీట మునిగి ఆవేదనలో రైతులు

### కోత దశలో ఉన్న పంట నీటమునిగి రైతులు కన్నీటి పర్యంతం

### ప్రతి రైతుకు తక్షణ నష్టపరిహారం చెల్లించాలని బిర్రు మహేందర్ మాదిగ డిమాండ్



తడిసిపోయిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులను హెూదారుస్తున్న నాయకుడు మహేందర్





నీట మునిగిన వారి ధాన్యాన్ని ట్రాక్టర్లో వస్తున్న మహేందర్ మాదిగ



**వర్ధన్నపేట/అక్టోబర్30 (జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో నిన్న కురిసిన మెంతో భారీ తుఫాన్ వర్షాల ప్రభావంతో గ్రామ పరిధిలోని సుమారు 1200 ఎకరాల ఆయకట్టు వరి పంట పొలాలు నీటమునిగిపోయాయి. కోత దశలో ఉన్న పంట పొలాలు నీటిలో మునగడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు కోసిన వరి ధాన్యాన్ని పొలాల వద్ద రాసులు వేసి ఉంచగా ఆ ధాన్యం కూడా నీటిలో మునిగిపోయి నష్టపోయింది. ఎరువులు దొరకక అప్పుల భారంతో ఇబ్బందులు పడుతూ అయినా కష్టపడి పండించిన పంట చేతికి అందకపోవడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.ఈ నేపథ్యంలో రైతుల పంట పొలాలను సందర్శించి వారిని ఓదార్చిన ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు, యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ బిర్రు మహేందర్ మాదిగ ఈ సందర్భంగామాట్లాడుతూ అకాల వర్షం, మెంతో తుఫాన్ వలన నల్లబెల్లి గ్రామ రైతులు తీవ్ర నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లించాలని జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. నీటమునిగిన రైతులలో ఎలబోయిన వీరన్నకు 50 క్వింటాలు, పొన్నం పరశు రాములకు 25 క్వింటాలు, ఎలబోయిన వెంకన్నకు 25 క్వింటాలు, ఎల్లబోయిన వీరస్వామికి 26 క్వింటాలు, జన్నపు రెడ్డి సంపత్ రెడ్డికి 25 క్వింటాలు, తోపుచర్ల తిరుమలరావుకు 50 క్వింటాలు, చిద్రబోయిన రవికి 20 క్వింటాలు, వాకిటి సతీష్‌కు 20 క్వింటాల వరి ధాన్యం నష్టపోయిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని బిర్రు మహేందర్ మాదిగ విజ్ఞప్తి చేశారు.

# నున్న పుల్లయ్య కి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపాసుధాకర్



**తల్లాడ/అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):**తల్లాడ మండలం తెలగవరం గ్రామస్తులు నున్న పుల్లయ్య దశదిన గురువారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్ హాజరై నున్న పుల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది. నివాళులర్పించిన వారిలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోత్కూరు శ్రీనివాసరావు, కాపా రామారావు, కాళోజి తదితరులు ఉన్నారు.

# తుఫాన్ వల్ల నష్ట పోయిన అన్నీ పంటలకు ఎకరాకు 25 వెలు నష్ట పరిహారం అందించాలి



**నర్సంపేట/అక్టోబర్ 30(జర్నలిస్ట్ వార్త):** గురిజాల గ్రామంలో బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్వర్యంలో తుఫాన్ వల్ల నష్ట పోయిన అన్నీ పంటలను నాయకులు పరిశీలించారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ బండారి శ్రీలత – రమేష్ మాట్లాడుతూ తుఫాన్ వల్ల దాదాపు అన్ని పంటలు పూర్తిగా నష్టపోయి రైతులకు చాల నష్టం జరిగింది అని తెలిపారు.ప్రభుత్వం వెంటనే స్పందించి అన్నీ రకాల పంటలకు ఎకరాకు రూ,25 వేల నష్ట పరిహారం అందించాలని కోరారు.గతంతో తెలంగాణ తోలి ముఖ్యమంత్రి కేసిఆర్ ముఖ్యమంత్రి గా ఉన్నపుడు మన ప్రాంతంలో తూఫాన్ వస్తే అప్పటి ఎంఎల్ఏ పెద్ది సుదర్శన్ రెడ్డి విజ్ఞప్తి మెరకు స్వయంగా పంటల పరిశీలనకు వచ్చి నష్ట పరిహారం అందించే విదంగా చర్యలు తీసుకునేదని గుర్తు చేశారు. తుఫాన్ కరంగా నష్టపోయినా రైతజలకు ప్రభుత్వం ఆదుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టి అధ్యక్షుడు చిన్న పెల్లి నరసింగం,మాజీ ఎంపీటీసీ లు గడ్డం కొమురయ్య,మాజీ సర్పంచ్ పోటు రాయపు రెడ్డి,న్యాయవాది క్లస్టర్ ఇన్చార్జి మోటురీ రవి,రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ అన్న రాజమల్లు,మండల పార్టీ ఉప అధ్యక్షుడు అల్లి రవి,మాజీ ఉప సర్పంచ్,మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంచిక హరీష్,మండల యూత్ ప్రధాన కార్యదర్శి సంగెం శ్రీకాంత్,మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షుడు బండారి చిన్న వెంకటేశ్వర్లు,గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు మంచిక దేవేందర్, పి ఏ సి ఎస్ డైరెక్టర్ ఎడ్ల రవీందర్,బిరన్న ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ డ్యాక రవి,మాజీ ఎస్ ఎం సి ఛైర్మన్ కొమ్మ రవి,కురుమ సంఘం మండల కోశాధికారి అరె సుధాకర్,గోడిషాల అశోక్,పోటు తిరుపతి రెడ్డి,మాజీ గ్రామ పార్టి అధ్యక్షుడు దూడల ప్రకాశ్,ఆకుల అశోక్,దూడల ప్రవీణ్,ముచింపుల చిన్న రవి,మార్ధ అనిల్,మర్ధ కుమారస్వామి,పెద్దరపు వీరాస్వామి,అల్లి ఐలయ్య,నీలం జనార్ధన్,అన్న కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు

# అకాల వర్షంతో అపార నష్టం

## చేతికొచ్చిన పంట కళ్ళ ముందే నేలపాలు

## ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని వేడుకలు





**తల్లాడ/అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):** మొంథా భారీ తుఫాన్ కారణంగా బుధవారం తెల్లవారుజామున నుండి కురుస్తున్న ఎడతెరిపి లేకుండా వానలకు ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ మండలంలో రైతులు కుదేలవుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి తుఫాను కారణంగా నీటిపాలు కావడంతో కన్నీరు మున్నీరుగా తమ విలపిస్తున్నారు. ముఖ్యంగా పత్తి పంట చేతికి రావడంతో కురుస్తున్న వర్షాలకు మొలక ఎత్తే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పంట చేతికొచ్చే సమయానికి వర్షం కారణంగా నేత మరణంతో రైతుల కోసం అంత ఇంత కాదని చెప్పాలి తుఫాన్ చాలా వేగంగా వహించి మండల రైతులను పెద్ద మొత్తంలో ఊబిలోకి నెట్టింది భారీ వర్షాల కారణంగా జనం జీవితాలను దెబ్బతీస్తూ పల్లె ప్రాంతాల్లో విస్తృతంగా పంట పొలాలను నాశనం చేసింది వరి పత్తి మిరప పంటలు తుఫాన్ తో పాటు గాలి వర్షం ముప్పుతో కిందపడిపోవడం వలన రైతులకు భారీగా హార్థిక నష్టం కలిగింది.ఈ సందర్భంగారైతులు మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలని తల్లాడకు చెందిన రైతులు మాట్లాడుతూ భారీ తుఫాన్ కారణంగా పంట నష్టపోయామని రైతులు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని మండల వ్యాప్తంగా ఉన్న రైతులు ముక్త కంఠంతో కోరుతున్నారు. చేతికొచ్చిన పంట నేలపాలు కావడంతో వ్యవసాయ సాగుకు వేలాది రూపాయలు అప్పు తెచ్చి సాగు చేశామని వడ్డీ మందం కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన పంట వివరాలను నమోదు చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

## ఆవిష్కరణలకు వేదికగా నిలిచిన సదస్సు




**వరంగల్/అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):**
వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల, బొల్లికుంటలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఇటీవలి ధోరణులు విద్యుత్, ఎలక్ట్రానిక్స్ ,కంప్యూటింగ్ సాంకేతికతలో అనే సదస్సు గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సయ్యద్ ముస్తాక్ మాట్లాడుతూ మొత్తం 256 ఆవిష్కరణాత్మక ప్రదర్శనలు ఎంపికైనట్లు తెలిపారు. అందులో 33 ప్రదర్శనలు ఆన్‌లైన్‌లో, మిగతావి మూడు వేదికలపై ప్రత్యక్షంగా నిర్వహించబడుతున్నాయని వివరించారు.
సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ నందేపు అఖిల్, శ్రీలిన్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధిపతి, మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు విద్యార్థుల్లో పరిశోధనా తపనను పెంపొందించడమే కాకుండా, ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధస్సు సాంకేతికత విద్యా రంగం,సాఫ్ట్వేర్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సదస్సు నిర్వాహకులుగా ప్రొఫెసర్ కె. షర్మిల, ప్రొఫెసర్ పి. మహిపాల్ రెడ్డి, ప్రొఫెసర్ రేఖా గంగుల, ప్రొఫెసర్ వి. మనోహర్, ప్రొఫెసర్ శ్రీనివాస్ కళ్యాణపు తో పాటు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# తుఫాన్ ప్రభావంతో ఉక్కిరి బిక్కిరైన వేలేరు మండలం.

**మృతి చెందిన మూగజీవాలు.**

**వందల ఎకరాల పంట ధ్వంసం.**

**కూలిన ఇండ్లు నిరాశ్రయులైన నిరుపేదలు.**

**తుఫాన్ బాదితులను ప్రభుత్వమే ఆదుకోవాలి.**

**సిపిఐ మండల కార్యదర్శి గడ్డమీది శంకరయ్య.**

**వేలేరు/అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):**
వేలేరు మండలంలో బుధవారం వివరీతంగా కురుసిన మొంథ తుఫాన్ ప్రభావంతో వివిధగ్రామాల ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవ్వడమే కాకుండా ఇండ్లు కూలి పోయి నిరాశ్రయులైన వారు, మూగజీవాలు చనిపోయి బాధ పడుతున్నవారు, చేతి కందిన వంట నోటికందకుండా ధ్వంసం అయిన వారి బాధలు వర్ణనాతీంగా ఉంది, అలాగే రోడ్లు తెగి పోవడంతో ఎక్కడి ప్రయాణీకులు అక్కడే తమగమ్యస్థానాలకు చేరుకోకుండా మిన్నకుండి పోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అలాగే మిషన్ భగీరథ పైప్ లైన్ లు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ స్థంభాలు డామేజ్ అవ్వడమేకాకుండా మూగజీవాలపై ఆధార పడిజీవనం కొనసాగిస్తున్న వారిమూగజీవాలు మృతి చెందిన వారి ఆర్తనాదాలు అగమ్య గోచరంగా ఉంది. ఆరుగాలం కష్టపడి రేయింబవల్లు కష్టపడి లక్షలాధి రూపాయలు పెట్టు బడులు పెట్టి నోటికాడికి వచ్చిన పంటలు చేతికి అందే సమయంలో వర్ష భీభత్సానికి ధ్వంసం అయిన రైతుల గోడులు పట్టించుకునే దెవ్వరని బాధిత రైతులు తమ ఆవేధనను వెల్ల బుచ్చుతున్నారు.



కమ్మరిపేటలో కూలిన ఇల్లు

### తుఫాన్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి.

**సిపిఐ వేలేరు మండల కార్యదర్శి గడ్డమీది శంకరయ్య**

బుధవారం కురిసిన వర్షానికి వేలేరు మండలం అతలాకుతలం అయ్యిందని సిపిఐ వేలేరు మండల కార్యదర్శి గడ్డమీది శంకరయ్య గురువారం ఒకప్రకటనలో తెలిపారు, ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వేలేరు మండలంలోని వివిధ గ్రామాలలో విస్తృతంగా ఉండడంతో వేల ఎకరాల వంటలు ధ్వంసం అవ్వడమేకాకుండా అలాగే ఆరుగాలం కష్టపడి లక్షలాధి రూపాయల పెట్టుబడులు పెట్టి వండించిన వంటలు చేతివచ్చిన పంట నోటికాడికి రాకుండా పోయిందని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వివిధగ్రామాలలో నిరుపేదల ఇండ్లు కూలిపోయి నిరశ్రయులై రోడ్డు పాలైన వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని బాధితులు ఆవేధన వ్యక్తం చేయడమేకాకుండా మరికొందరు తమ మూగజీవాలు వర్షానికి కొట్టుకు పోయి మృతి చెందాయని వాటిపైనే తాముఆధార పడి జీవిస్తున్నామని మొరపెట్టుకుంటున్న సంధర్భాలు



ఒరిగిన స్థంబాలు

ఒకవైపు ఉండగా వందలాది ఎకరాల వంట చేతికి వచ్చి వర్షానికి డామేజ్ కావడంతో లబోదిబోమని వేడుకుంటున్న సంధర్భాలు చూస్తుంటే హ్రుదయ విదారకంగా ఉందని ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి బాధితులను ఆదుకోవాలని వేలేరు సీపిఐ మండల కార్యదర్శి గడ్డమీది శంకరయ్య కోరుతున్నారు.



చనిపోయిన మూగ జీవాలు

# పోలీసులకు ప్రజల సహకారం అవసరం.

## - బెటాలియన్ అదనపు దళాధిపతి అంజయ్య.- బెటాలియన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం.

## - ఆయుధాల గురించి విద్యార్థులకు అవగాహన.





**సత్తుపల్లి/అక్టోబర్ 30(జర్నలిస్ట్ వార్త):**
నేరాల నియంత్రణలో, శాంతి భద్రతల పరిరక్షణలో,
సంఘవిద్రోహ శక్తుల ఆట కట్టించడంలో,
తమ రక్తాన్ని చిందించి, ప్రాణాలను ప్రాణంగా పెట్టి అసువులు బాసిన అమర పోలీసులకు గురువారం గంగారం 15వ పోలీసు బెటాలియన్ లో ఘనంగా నివాళులు అర్పించారు.బెటాలియన్ అదనపు దళాధిపతి అంజయ్య అధ్యక్షతన జరిగిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో సహాయ దళాధిపతులు శ్రీధర్ రాజా, రంగారెడ్డి, ఇతర పోలీసు అధికారులు, విశ్వశాంతి విద్యాలయం, డిఏవి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. భారత్– చైనా సరిహద్దుల్లో 16 వేల అడుగుల ఎత్తులో మంచు పర్వతాల మధ్య హాట్ స్ప్రిన్ ప్రాంతంలో భారత భూభాగం ఆక్రమణకు వచ్చిన చైనా సైనికులతో పోరాడి 1959 అక్టోబర్ 21న అసువులు బాసిన మన అమర పోలీసులకు ఘనంగా నివాళులు అర్పించారు.అదనపు దళాధిపతి అంజయ్య మాట్లాడుతూ.... పగలనకా, రాత్రనకా ఎండనక ,వాననక , అలసటను లెక్కచేయక పోలీసులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని అభినందించారు. సహాయ దళాధిపతులు శ్రీధర్ రాజా ,రంగారెడ్డి మాట్లాడుతూ దేశంలో శాంతి భద్రతలు ప్రతిష్టంగా ఉంటేనే దేశాభివృద్ధి, ఆర్థిక అభివృద్ధి సాధ్యమన్నారు. ఇంతటి ఘన కీర్తి కలిగిన పోలీస్ శాఖకు అండగా నిలవాల్సిన బాధ్యత దేశంలో ప్రతి పౌరునిపై ఉందని అభిప్రాయపడ్డారు.విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూఎవరికి ఏ ఆపద వచ్చినా, న్యాయం జరగాలన్న, రక్షణ కావాలన్నా మనం మొదటగా ఆశ్రయించేపోలీసులకు సహకరించాలని కోరారు. ఉగ్రవాదం అరికట్టడం లో , శాంతి భద్రతలు కాపాడటంలో, టెర్రరిజం మట్టు పెట్టడంలో తెలంగాణ పోలీస్ దేశానికి ఆదర్శం కావడం మన గర్వ కారణం అన్నారు.అనంతరం జరిగిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పోలీసు ఉపయోగించే వివిధ రకాల తుపాకులు వాటి తయారీ, వాటి పనితీరు గురించి విద్యార్థులకు వివరించారు.

# వర్ధన్నపేట మండలంలో 4000 ఎకరాల వరి నేలమట్టం

## పంటలను పరిశీలించిన ఏఓ విజయ్‌కుమార్





**వర్ధన్నపేట/అక్టోబర్30(జర్నలిస్ట్ వార్త):**
తుఫాన్ వర్షాల తాండవం వర్ధన్నపేట మండలాన్ని అతలాకుతలం చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో సుమారు 4000 ఎకరాల వరి పంట పూర్తిగా నీట మునిగిపోయి నేలమట్టమైంది. చెరువులు, వాగులు పొంగిపొర్లడంతో పంట పొలాల్లో నీరు నిల్వ ఉండి రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ గురువారం ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. గ్రామాల్లో వరి పంటలను పరిశీలించి, రైతులతో మట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పంట నష్టాన్ని సర్వే చేయిస్తున్నాం. ప్రభుత్వం నుండి వచ్చే మార్గదర్శకాలను అనుసరించి తగిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు నిరాశ చెందకూడదు, పంట నష్టానికి గాను ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తుఫాన్ కారణంగా పొలాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల విత్తనాలు పాడైపోవడంతోపాటు, పంట పూర్తిగా కుళ్లిపోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ వరి చేతికి వచ్చే సమయం లో తుఫాన్ రావడంతో మా పంటలో నీళ్ళు పోసింది. ఎరువులు, విత్తనాల ఖర్చు తిరిగి రావడంలేదని, ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని ఆవేదన వ్యక్తిత్వం చేస్తున్నారు.